సాక్షి
విజయనగరం

సోమవారం । 22 । జనవరి । 2024



పోరాట యోధుడు ఛత్రపతి

సమాజాన్ని దుర్మార్గం నుంచి సన్మార్గం వైపు నడిపించేందుకు అలుపెరగని పోరాటం చేసిన మహా యోధుడు ఛత్రపతి శివాజీ మహారాజ్. - 8లో



విద్యతోనే సమాజ వికాసం

సమాజం అభివృద్ధి పథంలో నడిచేందుకు విద్య చాలా అవసరమని సెంట్రల్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ టీవీ కట్టిమణి అన్నారు. - 8లో



సిమ్మినాయుడి సిత్రం.!

శ్రమిస్తే ఫలితం దక్కుతుందని పాలకొండ నగర పంచాయతీ పరిధి ఎన్‌కే.రాజపురానికి చెందిన వర్ధమాన సినీనటుడు సిమ్మినాయుడు రుజువు చేస్తున్నాడు. - 8లో

న్యూస్‌రీల్

410 క్యూసెక్కుల సాగునీరు విడుదల



కాలువ ద్వారా విడుదల అవుతున్న నీరు

వంగర: మండలంలోని మడ్డువలస కుడి ప్రధాన కాలువ ద్వారా ఆయకట్టు భూములకు 410 క్యూసెక్కుల నీటిని అధికారులు విడుదల చేస్తున్నారు. ఆయకట్టు పరిధిలోని వంగర, సంతకవిటి, రేగిడి, జి.సిగడాం మండలాల్లో సాగు చేస్తున్న ఆరుతడి పంటలకు ఈ నీటిని సరఫరా చేస్తున్నట్టు ఏఈ నితిన్ ఆదివారం తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టు వద్ద నీటి మట్టం 64.28 మీటర్లు లెవెల్ ఉన్నట్టు పేర్కొన్నారు. సువర్ణముఖి, వేగావతి నదుల నుంచి 410 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నట్టు ఏఈ తెలిపారు.

రక్తదానం ప్రాణదానం

- జిల్లా సైనిక సంక్షేమశాఖాధికారి కృష్ణారావు



రక్తం ఇస్తున్న దాతలు

విజయనగరం ఫోర్ట్: రక్తదానం ప్రాణదానమని జిల్లా సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు మజ్జి కృష్ణారావు అన్నారు. స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలోని రక్తనిధి కేంద్రంలో ఆశ్రయ బ్లడ్ డోనర్స్ క్లబ్ అధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తందానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న సాటి మనిషి ప్రాణాలు కాపాడవచ్చునన్నారు. ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరు ఏడాదికి నాలుగుసార్లు రక్తదానం చేయవచ్చనన్నారు. రక్తదానం నిరంతరం చేయడం ద్వారా రక్తకొరత లేకుండా చేయవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శైలజ, బి.రామకృష్ణరావు, అబ్దుల్ రవూఫ్, బి.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో జోరుగా కులగణన



గ్రామాల్లో కులగణన చేస్తున్న సచివాలయ సిబ్బంది

విజయనగరం అర్బన్: సమాజంలో వివిధ సామాజిక వర్గాల జనాభా, వారి స్థితిగతులను తెలుసుకొని వారికి మరింత ప్రయోజనం చేకూర్చాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కులగణన ప్రక్రియను శనివారం నుంచి ప్రారంభించింది. జిల్లాలో తొలి రోజే 99.68 శాతం సచివాలయాల పరిధిలో కులగణన ప్రారంభమైంది. మొత్తం 626 గ్రామ సచివాలయాలకుగాను మొదటి రోజు 624 సచివాలయాల్లో ఈ ప్రక్రి య నిర్వహించారు. మొత్తం 10,770 క్లస్టర్ల పరిధిలో 6,35,940 ఆవాసాలు ఉండగా సుమారు 18,31,209 మంది నుంచి వివరాలను సేకరించాల్సి ఉంది. మొదటి రోజు 624 సచివాలయాల పరిధిలోని 8,089 క్లస్టర్లలో సుమారు 80,362 ఇళ్లకు వెళ్లి, 1,73,008 మంది నుంచి సచివాలయ సిబ్బంది, వలంటీర్లు వివరాలను సేకరించారు. కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేసుకున్న అనంతరం, ఈకేవైసీ ద్వా రా వాటిని ధృవీకరిస్తున్నారు. రెండో రోజు ఆదివారం కూడా కులగణన ప్రక్రియ జిల్లా అంతటా నిరంతరాయంగా కొనసాగింది. ఎప్పటిలాగే వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వివరాలను సేకరించారు. పట్టణ ప్రాంతంలో కూడా కులగణన జోరుగా కొనసాగుతోంది. జిల్లా స్థాయిలో కలెక్టర్ నాగలక్ష్మి ఈ ప్రక్రియ పర్యవేక్షిస్తుండగా మండలాల్లో ఎంపీడీఓలు క్షేత్రస్థాయిలో గ్రామాల్లోకి వెళ్లి కులగణన ప్రక్రియను పరిశీలించారు. జిల్లా బీసీ సంక్షేమాధికారి నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తున్నారు. గ్రామ, వార్డు సచివాలయాల స్పెషల్ ఆఫీసర్ నిర్మలాదేవి పర్యవేక్షణలో సచివాలయాల ద్వారా నిరంతరాయంగా కులగణన జరుగుతోంది. ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో దీనికోసం రూపొందించిన ప్రత్యేక యాప్ ద్వారా వివరాలను నమోదు చేస్తున్నారు. సేకరించిన వివరాలను పూర్తి గోప్యంగా భద్రంగా ఉంచుతామని ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రజల సామాజిక, ఆర్థిక, విద్యాపరమైన స్థితిగతులను తెలుసుకోవడం కోసం కులగణన చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభు త్వ విధాన నిర్ణయాలను రూపొందించడానికి, సంక్షేమ పథకాలను అమలు చేయడానికి ఈ సర్వే వివరాలు దోహదపడతాయి. ముఖ్యంగా వివిధ కులా ల సామాజిక, ఆర్థిక పరిస్థితులు, వారి విద్య, జన సంఖ్య తెలుసుకొని, వారికి మరిన్ని ప్రయోజనాలను చేకూర్చడానికి ఈ సర్వే ఎంతగానో దోహదపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

నదీతీరంలో... బెల్లం
ఘుమఘుమలు



- ప్రారంభమైన బెల్లం గానుగలు
- మార్కెట్‌లో ఆశాజనకంగా బెల్లం ధర
- జావాం, కేఆర్‌పురం, హొంజరాం ప్రాంతాల బెల్లంకు భలే గిరాకీ

బెల్లంతో తయారు చేసే పిండి వంటల రుచే వేరు. అదే సమయంలో బెల్లం పిండి వంటలు ఆరోగ్యానికి కూడా మేలు చేస్తాయి. తెలుగు లోగిళ్లలో వచ్చే పండగల సమయంలో బెల్లం పిండి వంటలకు ఉండే గుర్తింపే వేరు. ఈ సమయంలో నదీ తీరంలో బెల్లం గానుగలు ప్రారంభమయ్యాయి. బెల్లానికి మంచి గిరాకీ ఉండడంతో చెక్కీలు విస్తారంగా తయారు చేస్తున్నారు.

రాజాం :

మన సంప్రదాయ పండగ వచ్చిందంటే చాలు.. ప్రతి ఇంటా పిండి వంటలు తయారీ అవుతాయి. వీటికి ప్రధాన ముడిసరుకైన బెల్లానికి ఈ సమయంలో డిమాండ్ ఉంటుంది. ఇదే అదునుగా చెరకు రైతులు గానుగలు సిద్ధం చేసి బెల్లం తయారీ చేస్తారు. ప్రతీ ఏడాది సంక్రాంతి ముందు నుంచి బెల్లం తయారీ ప్రారంభం అవుతుంది. శివరాత్రి వరకూ ఈ బెల్లం గానుగలు కనువిందు చేస్తాయి. ప్రధానంగా రాజాం నియోజకవర్గం నాగావళి నదీ తీరంలో ఎక్కువగా చెరకు సాగు ఉంది. వంగర, రేగిడి, సంతకవిటి మండలాల్లో సాగు చేసే చెరకు పంటలో 30 శాతం బెల్లం తయారీకి రైతులు వినియోగిస్తారు. మిగిలిన రైతులు రేగిడి మండలంలో సంకిలి వద్ద ఈఐడీ ప్యారీ చక్కెర కర్మాగారానికి తరలిస్తారు. పండగ సందర్భంగా బెల్లంకు డిమాండ్ పెరగడంతో నదీతీరాల్లోని గ్రామాల్లో బెల్లం గానుగలు ప్రారంభమయ్యాయి.



జావాం వద్ద పెనంలో బెల్లాన్ని చెక్కీలకు ఎక్కిస్తున్న రైతులు

జావాం బెల్లానికి గిరాకీ

నదీతీరంలో సాగు చేసే చెరకు ఏపుగా పెరుగుతుంది. మట్టిసారం ఆధారంగా చెరకులో రుచి వస్తుంది. సంతకవిటి మండలంలో జావాం, కేఆర్‌పురం, హొంజరం గ్రామాల్లో నాగావళి నదీతీరాన పండే చెరకు పంటకు డిమాండ్ ఉంది. ఇక్కడ చెరకు ఏపుగా పెరగడంతో పాటు ఇక్కడ తయారీచేసే బెల్లానికి డిమాండ్ చాలా ఎక్కువగా ఉంటుంది. ఎటువంటి రసాయనాలు కలపకుండానే ఇక్కడ బెల్లం ఎరుపు రంగులోకి వస్తుంది. రుచిగా ఉండడంతో పాటు బెల్లం చూడగానే తినాలనిపించే ఆసక్తిని పెంచుతుంది. పిండి వంటల్లో ఈ బెల్లాన్ని వినియోగిస్తే అద్భుతమైన రుచితనం కనిపిస్తుంది. అందుకే ఈ ప్రాంతాల్లో బెల్లాన్ని గానుగలు వద్దే హాట్ కేక్‌ల్లా కొనుగోలు చేస్తారు. సాధారణంగా మార్కెట్‌లో బెల్లం ధర కిలో రూ.42లు ఉండగా, ఇక్కడ బెల్లం ధర రూ.45లు దాటి పలుకుతుంది.



విక్రయానికి సిద్ధంగా బెల్లం చెక్కీలు

భలే ఆదాయం

బెల్లం తయారీ కష్టంతో కూడుకున్న పని. రైతులు ఇంటిల్లపాది కష్టపడితే ఫలితం దక్కుతుంది. బెల్లం గానుగలకు అధునాతన వస్తు సామగ్రి అందుబాటులోకి వచ్చినప్పటికీ పాకం తయారీకి పెనం విధానం తప్పనిసరి. కూలీల ద్వారా చెరకును నరికి, వీటిని క్రషింగ్ యంత్రాలు సాయంతో నలిపి రసం తీస్తారు. ఇలా వచ్చిన చెరకు రసాన్ని పెనంపై పాకం తీసి, పాకం రాగానే చెక్కీలు, కుండలుగా మలుస్తారు. గతంలో రెండు కిలోలు, మూడు కిలోలు కుండలు ఉండేవి. ఇప్పుడు 10 కిలోల చెక్కీలు నుంచి 18 కిలోల చెక్కీలు తయారీ చేస్తున్నారు. వీటిని నేరుగా గానుగలు వద్దే విజయనగరం, శ్రీకాకుళం, రాజమండ్రి, విజయవాడ, ఒడిశా వ్యాపారులు కొనుగోలు చేస్తారు. ఎకరా సాగులో నాలుగు నుంచి ఐదు టన్నులు బెల్లం దిగుబడి వస్తుంది. ప్రస్తుతం మార్కెట్‌లో టన్ను బెల్లం ధర రూ.42 వేలు పైబడి ఉంది. ఎకరా చెరకు పంట సాగుకు తొమ్మిది నెలల కాల వ్యవధి పట్టగా, రూ.50 వేల వరకూ పెట్టుబడులు పెట్టాల్సి ఉంటుంది. ఫ్యాక్టరీకి ఇచ్చేకంటే కుటుంబం అంతా కలసి గానుగవద్ద పని చేస్తే మంచి ఆదాయం వస్తుంది. అయితే బెల్లం పాకం సమయంలో అజాగ్రత్త వహిస్తే నష్టపోయే ప్రమాదం కూడా ఉంది.

భలే డిమాండ్



రేగిడి, సంతకవిటి మండలాల్లో తయారీ చేస్తున్న బెల్లంకు ప్రస్తుతం మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. ఈ బెల్లం తయారీ కష్టంతో కూడుకున్న పని కావడంతో చాలా మంది రైతులు వెనుకడుగు వేస్తున్నారు. సంక్రాంతి నుంచి శివరాత్రి వరకూ బెల్లం గానుగలు నాగావళి నదీతీరాన కనిపిస్తుంటాయి. ఈ బెల్లం తయారీ ఘుమఘుమలు పండగ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో కొత్తదనాన్ని తీసుకొస్తుంటాయి.

– కె.చంద్రరావు, వ్యవసాయశాఖ ఏడీఏ, రాజాం.

టీడీపీని భూస్థాపితం చేద్దాం..

- ఉత్తరాంధ్రలో సీఎం జగన్ సభకు తరలిరండి
- చంద్రబాబు విమర్శలు సిగ్గుచేటు
- ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర



మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: రానున్న ఎన్నికల్లో అంతా కలసికట్టుగా పని చేసి టీడీపీని భూస్థాపితం చేద్దామని వైఎస్సార్ సీపీ శ్రేణులకు ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర పిలుపునిచ్చారు. భీమిలిలో ఈ నెల 27న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సభ జరగనున్న నేపథ్యంలో పార్టీ శ్రేణులతో ఆయన ఆదివారం పట్టణంలోని వెలమపేట కల్యాణ మండపం వద్ద సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జన్మభూమి కమిటీలతో చంద్రబాబు చేసిన అప్రజాస్వామిక నిరంకుశ పాలనకు ప్రజలు చరమ గీతం పాడారన్నారు. మళ్లీ ప్రజలను మోసం చేసేందుకు చంద్రబాబు వస్తున్నారని తగిన బుద్ధి చెప్పాలన్నారు. జగనన్న పాలనలో పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందుతున్న విషయాన్ని ప్రజలు గుర్తించారని, వచ్చే ఎన్నికల్లో టీడీపీకి తగిన గుణపాఠం తప్పదని పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర నుంచే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల విజయ శంఖారావం పూరించనున్నారని తెలిపారు. చంద్రబాబు ఇటీవల ఓ సభలో రోగుల తరలింపు విషయమై డోలీలు కడుతున్నారని విమర్శించడంపై ఆయన తీవ్రంగా మండిపడ్డారు. 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు గిరిశిఖర గ్రామాలకు రోడ్లు వేసి ఉంటే గిరి శిఖరాల్లో డోలీలు కట్టే పరిస్థితి నేడు ఉండేదా? అని ప్రశ్నించారు. టీడీపీ పాలనలో గిరిజన గ్రామాల అభివృద్ధి కుంటుపడిందన్నారు. సాలూరు నియోజకవర్గంలో టీడీపీ పాలనలో ఒక్క రోడ్డు అయినా వేసారా? అని ప్రశ్నించారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గిరిశిఖర గ్రామాల్లో రహదారులు వేస్తున్నామని, మళ్లీ ముఖ్యమంత్రి అయితే డోలీల పరిస్థితే లేకుండా చేస్తామని గర్వంగా చెప్పగలన్నారు. సమావేశంలో పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు శ్రీనివాసరెడ్డి ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు శంబర పోలమాంబ
తొలేళ్ల ఉత్సవం

- రాత్రి 11 గంటల ప్రాంతంలో గ్రామానికి చేరుకున్న సిరిమాను కర్ర



మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు, భక్తులు ఆరాధ్యదైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా ప్రసిద్ధిగాంచిన శంబర పోలమాంబ అమ్మవారి తొలేళ్ల ఉత్సవం సోమవారం జరగనుంది. జాతరకు ఇతర జిల్లాలతో పాటు ఒడిశా, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాలతో జిల్లా నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు రానున్నారు. జాతరకు వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పార్వతీపురం ఏఎస్పీ సునీల్ సొరేన్ పర్యవేక్షణలో జాతర ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ ఈఓ వీవీ సూర్యనారాయణ, డీఎల్‌పీఓ బి.సత్యనారాయణ, సీఐ ధనుంజయరావు, ఎస్‌ఐ నరశింహ మూర్తి జాతర ఏర్పాట్లు ఆదివారం పరిశీలించారు.

700 మందితో పోలీస్ బందోబస్తు

శంబర పోలమాంబ అమ్మవారి జాతరను డ్రోన్స్ సహాయంతో, స్టాట్యూట్ కెమెరాలతో ఒకే కంట్రోల్‌రూమ్ నుంచి మోనటరింగ్ చేసేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటుచేశారు. జాతరలో ఏఎస్పీతో పాటు, నలుగురు డీఎస్పీలు, 15మంది సీఐలు, 40మంది ఎస్‌ఐలు, ఏఎస్‌ఐలు, హెచ్‌సీలు, పీసీలు, హోంగార్డులు, ఆర్మ్‌డ్ ఫోర్స్, క్లూస్ టీం, క్రైం పార్టీ, రోప్ పార్టీ, సేవాదళ్(పోలీస్‌మిత్ర), మహిళా పోలీసులతో సుమారు 700మంది పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు. వనంగుడి వద్ద పోలీస్ సహాయ కేంద్రం ఏర్పాటు చేశారు.

70వేల లడ్డూ ప్రసాదం తయారీ

భక్తులకు ప్రసాదాన్ని అందించేందుకు ఆలయ ఈఓ వి.వి.సూర్యనారాయణ ఆధ్వర్యంలో తొలి జాతరలో 30వేలు లడ్డూ ప్రసాదాన్ని తయారు చేశారు. మిగిలిన తొమ్మిది వారాలకు మరో 40 వేల లడ్డూ తయారు చేయనున్నారు. భక్తులకు అవసరమైన మేరకు పులిహోర ప్రసాదాన్ని తయారు చేశారు. దేవదాయ శాఖ సిబ్బంది 100మంది విధులు నిర్వహించనున్నారు. ప్రసాదాల కౌంటర్లు వనంగుడి వద్ద ఒకటి, చదురుగుడి ఆలయం సమీపంలో రెండు, వైఎస్సార్ విగ్రహం వద్ద ఒకటి ఏర్పాటు చేశారు. వనంగుడి వద్ద, ప్రధానాలయం వెనుక ఉచితం, ప్రత్యేక దర్శనం, శీఘ్రదర్శనం క్యూలైన్లు ఏర్పాటు చేశారు. తాగునీటికి ఇబ్బందులు లేకుండా సాలూరు, బొబ్బిలి, పార్వతీపురం మున్సిపాల్టీల నుంచి మూడు తాగునీటి ట్యాంకర్లను తీసుకువచ్చారు. తాత్కాలిక మరుగుదొడ్లు, దుస్తులు మార్చిడి గదులను ఏర్పాటు చేశారు.

నాలుగు చోట్ల పార్కింగ్ స్థలాలు

శంబర గ్రామం నలువైపులా నాలుగుచోట్ల వాహనాల పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశారు. మక్కువ నుంచి కవిరిపల్లి మీదుగా శంబర గ్రామానికి చేరుకునే వాహనాలను జడ్పీహెచ్‌ఎస్ సమీపంలో, చెముడు మీదుగా వచ్చిన వాహనాలు గోముఖీ బ్రిడ్జ్ వద్ద, మామిడిపల్లి మీదుగా వచ్చిన వాహనాలకు వీఆర్‌ఎస్ ప్రాజెక్ట్ వద్ద, మావుడి నుంచి ఎస్.పెద్దవలస మీదుగా వచ్చిన వాహనాలను గ్రామం శివారులో వాహన పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశారు. జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నివారించేందుకు దేవదాయ శాఖ, పోలీసుల ఆధ్వర్యంలో గ్రామంలో 41 ప్రదేశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. డ్రోన్ కెమెరాతో జాతర పరిశీలించనున్నారు. ఆరు కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు.

నాలుగు చోట్ల వైద్య శిబిరాలు

గ్రామంలోని వనంగుడి వద్ద, చదురుగుడి క్యూలైన్లు, అంగన్‌వాడీ కార్యాలయం వద్ద, పీహెచ్‌సీ వద్ద నాలుగు వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ఒక్కో వైద్య శిబిరం వద్ద మెడికల్ ఆఫీసర్‌తో పాటు ఇద్దరు సిబ్బంది ఉంటారు. గ్రామంలో 120మంది పారి శుధ్య కార్మికులతో పారిశుధ్య పనులు చేయిస్తున్నారు.

జాతరకు 150 బస్సులు

శంబర పోలమాంబ అమ్మవారి జాతర సందర్భంగా సోమవారం నుంచి బుధవారం వరకు సుమారు 150 బస్సులను ఆర్టీసీ నడపనుంది. సోమవారం సుమారు ఏడు డిపోల నుంచి 40బస్సులు నడపనున్నారు. మంగళవారం సిరిమానోత్సవం సందర్భంగా భక్తులు సౌకర్యార్థం పార్వతీపురం, సాలూరు, ఎస్.కోట, శ్రీకాకుళం, రాజాం, పాలకొండ, విజయనగరం డిపోల నుంచి బస్సులను నడపనున్నారు.

రాత్రి 11గంటలకు గ్రామానికి చేరుకున్న సిరిమాను కర్ర

శంబర గ్రామం సమీపంలో గూండాం కొండ సమీపంలో సేకరించిన సిరిమాను కర్ర, బట్టివలస గ్రామం సమీపంలో గుజ్జుమాను కర్రను గ్రామానికి చెందిన రైతులు గుర్తించి, ఆదివారం పశువులేర్లుతో తీసుకువచ్చారు. అయితే తాడికర్ర (సిరిమానుకు ఉపయోగించే కర్ర) ఎత్తు తక్కువగా ఉండటంతో పాటు, గుజ్జుమాను కర్ర సక్రమంగా లేకపోవడంతో, సిరిమానును తయారుచేసే వడ్రంగులు అభ్యంతరం తెలిపారు. తప్పనిసరి పరిస్థితుల్లో యువత, రైతులు తాడికర్రను గుర్తించేందుకు మళ్లీ కొండల వైపు బయలుదేరి వెళ్లారు. సాయంత్రం నుంచి సిరిమాను చెట్టు కోసం, అడవుల వైపు, కొండల వైపు వెళ్లగా, ఎట్టకేలకు సెల్‌ఫోన్లు సహాయంతో రాత్రి 8గంటల ప్రాంతంలో పాండవులు కొండపై సిరిమాను చెట్టును గుర్తించారు. రాత్రి 11 గంటల ప్రాంతంలో గ్రామానికి తీసుకువచ్చారు.



సిరిమాను చెట్టు

దూసుకొచ్చిన మృత్యువు
అన్నదమ్ముల మృతి

- బైక్‌ను ఢీకొన్న ట్రాక్టర్
- అన్నదమ్ముల దుర్మరణం
- ఏడాది కిందట సోదరి మృతి
- సంతానమంతా మృత్యువాత
- తల్లిదండ్రుల అరణ్యరోదన
- గొల్లపేటలో విషాదం

ఆ కుటుంబంలో తల్లిదండ్రులకు ముగ్గురు సంతానం. వారిలో ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. ఏడాది కిందట కుమార్తె మృతి చెందగా.. ఆదివారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు అన్నదమ్ములు మృత్యువాత పడ్డారు. దీంతో తల్లిదండ్రుల వేదన చెప్పనలవి కాకుండా ఉంది. అయ్యో.. దేవుడా.. మేమేమి పాపం చేశాం.. ఇంత శిక్ష అంటూ తల్లిదండ్రులు రోదించిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది. వివరాల్లోకి వెళ్తే...




ప్రమాదంలో మృతి చెందిన సురేష్‌కుమార్, రమేష్‌కుమార్

పూసపాటిరేగ: మండలంలోని గొల్లపేటకు చెందిన నక్కాన రాము, ఆదిలక్ష్మి దంపతులకు ముగ్గురు సంతానం. వీరిలో నక్కాన సురేష్‌కుమార్, నక్కాన రమేష్‌కుమార్, నక్కాన సునీత ఉన్నారు. సునీత ఏడాది కిందట వ్యక్తిగత కారణాలతో మృత్యువాత పడింది. మిగిలిన ఇద్దరు కుమారులు అనకాపల్లి జిల్లా నక్కపల్లి హెటిరో డ్రగ్స్ కెమికల్ పరిశ్రమలో కార్మికులుగా కొన్నాళ్లుగా పని చేస్తున్నారు. వీరిద్దరూ సంక్రాంతి పండగ కోసం స్వగ్రామం గొల్లపేటకు వచ్చారు. సంక్రాంతి తరువాత శనివారం తాత గారింటికని ఎరుకొండ వెళ్లారు. అక్కడ సరదగా గడిపి ఆదివారం వేకువజామున 5 గంటల సమయంలో స్వగ్రామం గొల్లపేటకు బైక్‌పై బయలు దేరారు. పేరాపురం జంక్షన్ సమీపంలో జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న సర్వీసు రోడ్డులోకి వచ్చేటప్పటికీ ఎదురుగా మట్టి లోడుతో వస్తున్న ట్రాక్టర్ వీరి బైక్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో సురేష్‌కుమార్ (26), రమేష్‌కుమార్(25) సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. మృతదేహాలకు శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం సుందరపేట సీహెచ్‌సీకి తరలించారు. ఎస్‌ఐ జి.బాలకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనతో గొల్లపేటలో విషాదం అలుముకుంది.

వరుస మరణాలు నింపిన విషాదం

ఒకే కుటుంబంలో ఏడాది కాలంలో ముగ్గురు సంతానం మృత్యువాత పడడంతో తల్లిదండ్రులు రాము, ఆదిలక్ష్మి రోదనలు మిన్నంటాయి. తమ సంతానంపై దేవుడికి ఎందుకింత కోపమంటూ వారు కన్నీరుమున్నీరయ్యారు. తమ సంతానమంతా మృతి చెందగా తాము ఇంకా ఎవరి కోసం బతకాలంటూ రోదిస్తున్నారు. తమను కూడా ఆ దేవుడు తీసుకుపోతే బాగున్నంటూ కన్నీంటి పర్యంతమయ్యారు. వారి అరణ్య రోదనలు చూపరులను కంటతటి పెట్టించాయి.



ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్

రామతీర్థానికి అయోధ్య శోభ

- నేడు స్వామి వారికి ప్రత్యేక పూజలు



విద్యుత్ కాంతులతో రామతీర్థం దేవస్థానం

నెల్లిమర్ల రూరల్: అయోధ్య శ్రీరామ మందిరంలో బాలరాముడు ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో సోమవారం ప్రత్యేక పూజలు జరగనున్నాయి. ఇందుకు సంబంధించి దేవస్థాన సిబ్బంది అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. విద్యుత్ కాంతులతో ఆలయాన్ని సిద్ధం చేశారు. ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలతో సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయ ప్రాంగణంలో అలంకరించేందుకు ఇప్పటికే వివిధ రకాల మొక్కలను కొనుగోలు చేశారు. వేకువజామున స్వామికి ప్రాతః కాలార్చన, బాలభోగం నిర్వహించిన తరువాత యాగశాలలో విశేష హోమాలు జరిపిస్తారు. అనంతరం స్వామి కల్యాణాన్ని వైభవంగా జరిపించి అయోధ్య నుంచి తెచ్చిన అక్షతలకు ప్రత్యేక పూజలు చేయనున్నారు. అయోధ్యలో శ్రీరాముడి ప్రాణ ప్రతిష్ఠ అనంతరం స్వామి వారి అక్షతలను భక్తులకు పంపిణీ చేస్తామని ఈఓ కిషోర్‌కుమార్ తెలిపారు.

క్లుప్తంగా

ద్విచక్ర వాహనదారు మృతి


పవన్‌కుమార్ మృతదేహం


బవిరెడ్డి పవన్ కుమార్(ఫైల్)

పాచిపెంట: మండలంలోని పోలీస్ స్టేషన్ సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన మండల కేంద్రానికి చెందిన బవిరెడ్డి పవన్‌కుమార్ (25) మృతిచెందాడు. దీనికి సంబంధించి ఎస్సై నారాయణరావు ఆదివారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శనివారం రాత్రి సాలూరు నుంచి స్వస్థలమైన పాచిపెంట మండల కేంద్రానికి ద్విచక్రవాహనంపై వస్తున్న పవన్‌కుమార్ పాచిపెంట పోలీస్ స్టేషన్ సమీపంలో అదుపుతప్పి చెట్టును ఢీకొన్నాడు. ఈప్రమాదంలో తీవ్రగాయాలపాలైన పవన్‌ను సాలూరు ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మరణించాడు. బీఎల్ ఫైనల్ ఇయర్ చదువుతున్న పవన్ తమకు అందివస్తాడని భావించిన భావించిన తల్లిదండ్రులు కుమారుడి మరణంతో కన్నీరుమున్నీరై విలపిస్తున్నారు.

రైలు ఢీకొని వ్యక్తి..


జగన్నాథరావు మృతదేహం

విజయనగరం క్రైమ్: పట్టణంలోని గాజులరేగకు చెందిన బొండపల్లి జగన్నాథరావు (33) రైలు ఢీకొని ఆదివారం మృతిచెందాడు. ఈ సంఘటనపై జీఆర్‌పీ సిబ్బంది తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జగన్నాథరావు రైల్వే ట్రాక్ దాటుతుండగా ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. జగన్నాథరావు నెల్లిమర్లలోని ఓ మెకానిక్ షెడ్‌లో వెల్డర్‌గా పనిచేస్తున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మృతదేహాన్ని జిల్లా కేంద్రాస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్‌పీ ఎస్సై రవివర్మ తెలిపారు.

53 మద్యం సీసాలు స్వాధీనం

బొండపల్లి: మండలంలోని ముద్దూరు గ్రామంలో అక్రమంగా నిల్వ చేసి విక్రయించడానికి సిద్ధంగా ఉన్న53 మద్యం బాటిల్స్‌ను ఆదివారం సాయంత్రం స్వాధీనం చేసుకున్నట్లు ఎసై కె.లక్ష్మణరావు తెలిపారు. ఈ మేరకు మద్యం విక్రయిస్తున్న బాలి తారకేశ్వరావును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు చెప్పారు.

వల్లూరులో 200 బాటిల్స్


నెల్లిమర్ల రూరల్: స్వాధీనం చేసుకున్న మద్యం బాటిల్స్‌తో సీఐ వెంకటేశ్వరరావు, సిబ్బంది

నెల్లిమర్ల రూరల్: మండలవ్యాప్తంగా మద్యం బెల్ట్ షాపులపై పోలీసులు ఉక్కు పాదం మోపుతున్నారు. నిత్యం తనిఖీలు చేపడుతూ మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకుంటున్నారు. ఈ క్రమంలో ఆదివారం వల్లూరు జంక్షన్‌లో బైక్‌పై అక్రమంగా మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి 200 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఆ ఇద్దరు వ్యక్తులపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ వెంకటేశ్వరరావు, ఎస్సై రామగణేష్ తెలిపారు.

నరయ్యవలసలో..

27 మద్యం బాటిల్స్

దత్తిరాజేరు: మండలంలోని సరయ్యవలస వద్ద అనుమతులు లేకుండా నిల్వ ఉంచిన 27 మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పెదమానాపురం ఎస్సై శిరీష ఆదివారం తెలిపారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు గ్రామానికి చెందిన వ్యక్తిని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వైద్య పరీక్షల అనంతరం రిమాండ్‌కు తరలించనున్నట్లు చెప్పారు.

గిడుగు.. తెలుగు భాషకు గొడుగు

- 22న గిడుగు వెంకట రామ్మూర్తి వర్ధంతి
- వ్యవహారిక భాషా పితామహుడిగా ఖ్యాతి
- వ్యవహారిక భాషతోనే నేడు బోధన


స్వగ్రామం పర్వతాల పేటలో గిడుగు రామ్మూర్తి విగ్రహం

శ్రీకాకుళం కల్చరల్: గ్రంథాలు పండితులకు మాత్రమే అందుబాటులో ఉన్న పరిస్థితుల్లో.. పుస్తకాలు ఉన్నతులకు మాత్రమే అర్థమవుతున్న కాలంలో ఆ మహానుభావుడు చేసిన పోరాటం భాషను సామాన్యులకు చేరువ చేసింది. పామరుడు కూడా విషయం తెలుసుకోగలిగేలా మార్పులు తీసుకువచ్చింది. వ్యవహారిక భాషపై పోరాటం చేసింది గిడుగు రామ్మూర్తి పంతులు. గ్రాంథిక భాషా చెర నుంచి భాషను విముక్తి చేయడానికి గిడుగు రామ్మూర్తి ఆ కాలంలో పెద్ద పోరాటమే చేశారు. ముఖ్యంగా శిష్ట వ్యవహారికంపై ఆయన పోరాటం చేశారు. వాడుక భాష ద్వారా మాత్రమే ప్రజల భావ వ్యక్తీకరణ జరుగుతుందని, తద్వారా మాత్రమే సమాజంలో ఉన్నతమైన ప్రజాస్వామిక విలువలు ఏర్పడతాయని ముందుగా గుర్తించి ఛాందసుల నుంచి పెద్ద సవాలునే ఎదుర్కొన్నారు. ఆ పోరాటాల ఫలితంగానే ఇప్పుడు బోధన, పాఠ్య పుస్తకాల ముద్రణలో వ్యవహారిక భాష కనిపిస్తోంది. అందుకే ఆయన విగ్రహాన్ని ఇంటాక్ ఆధ్వర్యంలో శ్రీకాకుళంలో ఏర్పాటు చేశారు. ఇటీవల గాంధీ మందిరంలో కూడా విగ్రహం ఏర్పాటు చేశారు. పలాస సమీపంలోని రంగోయిలో భద్రి కూర్మారావు గిడుగు కళాపీఠం ఏర్పాటు చేసి గత 20 ఏళ్లుగా భాషాభివృద్ధికి కృషి చేస్తున్నారు.

సరిహద్దులో పోరాటం..

వ్యవహారిక భాషా పితామహుడైన గిడుగు రామ్మూర్తి శ్రీకాకుళం జిల్లా సరుబుజ్జిలి మండలం, పర్వతాలపేటలో ఆగస్టు 29, 1863లో జన్మించారు. ఆయన జన్మదినాన్ని తెలుగు భాషా వికాస దినోత్సవం ప్రభుత్వం గుర్తించింది. వ్యవహారిక భాషతో పాటుగా సవర భాషాభివృద్ధికి కృషి చేశారు. సవర భాష లిపి రూపొందించి, ఆ భాషలో రచనలు చేశారు. సవర భాషా నిఘంటువు, వ్యాకరణం తయారు చేశారు. గిడుగుకు జిల్లా సరిహద్దు ప్రాంతం పర్లాఖిమిడి పరిసరాలే పోరాట స్ఫూర్తిని ఇచ్చాయి. 1892లో సవర భాష నేర్చుకోవడం ప్రారంభించారు. శ్రీముఖలింగ ఆలయ గోడలపై ఉన్న శాసనాలను క్రోడీకరించి 'అంటిక్విటీజ్ ఆఫ్ ముఖలింగం' పేరుతో ఇంగ్లిష్ వ్యాసం రచించారు. మాతృ భాషలోనే బోధనలు జరగాలని 'తెలుగు' అనే పత్రికను 1919లో ప్రారంభించారు. 1922లో కొన్ని నీతి కథలను చిన్నారుల కోసం వ్యవహారికంలో రచించారు. ఆయన సేవలను గుర్తించిన నాటి ప్రభుత్వం 'కైజర్-ఇ-హింద్' బంగారు పతకం, 'రావుసాహేబ్' బిరుదును ప్రధానం చేసింది. 1938లో ఆంధ్రా యూనివర్సిటీ 'కళాప్రపూర్ణ' బిరుదు ఇచ్చి గౌరవించింది. 1940 జనవరి 22న గిడుగు పరమపదించారు.

భాషా సంస్కృతులను కాపాడుతున్నాం



భాషా సంస్కృతులను కా పాడేందుకు గిడుగు ఆశయాల సాధనకు కృషి చేస్తున్నాం. చిన్నతనంలో అమ్మమ్మలు, నాయనమ్మలు చెప్పిన 120 కథలను సేకరించి, పిల్లలు రాసిన కళింగసీమ జానపద కథలు పుస్తకాన్ని కూడా తెచ్చాం.

– బద్రి కూర్మారావు, గిడుగు రామ్మూర్తి పీఠం నిర్వాహకులు

గిరిజన యూనివర్సిటీకి గిడుగు పేరు పెట్టాలి



విజయనగరం జిల్లాలో ఏర్పాటు చేసిన గిరిజన యూనివర్సిటీకి గిడుగు రామ్మూర్తి పేరు పెట్టాలి. ఆయన వ్యవహారిక భాషోద్యమం ఫలితంగానే తెలుగు భాషలో విప్లవాత్మక మార్పులు వచ్చాయి.

– వాండ్రంగి కొండలరావు, నామ విజ్ఞాన వేత్త, జీవితకాల సభ్యుడు ఎన్‌టీటీ క్లబ్, పొందూరు

అలుపెరగని పోరాట యోధుడు ఛత్రపతి


ఛత్రపతి శివాజీ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులర్పిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు
- సిటీబస్టాండ్ జంక్షన్‌లో శివాజీ విగ్రహావిష్కరణ

విజయనగరం: సమాజాన్ని దుర్మార్గం నుంచి సన్మార్గం వైపు నడిపించేందుకు అలుపెరగని పోరాటం చేసిన మహాయోధుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ అని ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావులు ఉద్ఘాటించారు. ఈ మేరకు ఆదివారం విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్‌పరిధిలోని సిటీ బస్టాండ్ రోడ్డులో భావసార్ క్షత్రియ అసోసియేషన్, జిల్లా బంగారం, వెండి టెస్టింగ్, మెల్టింగ్ ఓనర్స్ అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ మహారాజ్ కాంస్య విగ్రహాన్ని వారు ఆవిష్కరించారు. అనంతరం విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అంతకుముందు భావసార్ క్షత్రియ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్‌లు కోలగట్ల శ్రావణి, ముచ్చు లయయాదవ్, వైఎస్సార్‌సీపీ పలాస నియోజకవర్గ పరిశీలకుడు కేవీ సూర్యనారాయణరాజు, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, భావసార్ క్షత్రియ అసోసియేషన్ అధ్యక్షుడు గోజె శ్రీనివాస్, టి.ఈశ్వరరావు, జడే తులసీరావు, హరీష్‌కుమార్, పి.సత్యరాజ్, డాక్టర్ సుమన్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో టీడీపీ కార్యకర్తల చేరిక


పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే అప్పలనరసయ్య

- పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే అప్పలనరసయ్య

గంట్యాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజారంజక పాలన చేస్తున్నారని గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య పేర్కొన్నారు. ఈ మేరకు విజయనగరంలోని ఆయన నివాసంలో గంట్యాడ మండలంలోని నరవ గ్రామానికి చెందిన 40 మంది టీడీపీ కార్యకర్తలు సర్పంచ్ పతివాడ భాస్కరావు, ఎంపీటీసీ మోపాడ అప్పలరాజు ఆధ్వర్యంలో ఆదివారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే అప్పలనరసయ్య పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.సీఎం జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు వారంతా తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అప్పలనరసయ్య మాట్లాడుతూ మాట్లాడుతూ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం పార్టీలు, కులాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తోందని చెప్పారు. చేరికలతో వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతమవుతుందన్నారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త పాటు పడాలని కోరారు. పేద, మధ్యతరగతి వర్గాల సంక్షేమానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. పార్టీలో చేరిన వారిలో సుంకరి అప్పలనాయుడు, సుంకరి భూలోకరావు, సుంకరి పైడిరాజు, సుంకరి రాము, సుంకరి సంతోష్, ఎస్. భూలోకరావు, సుంకరి అప్పలరాజు, సుంకరి భద్రినాయుడు, సుంకరి నారాయణమ్మ, కోరాడ రమణ, కోరాడ అప్పలనాయుడ, కోరాడ నారాయణరావు తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వర్రి నరసింహమూర్తి, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు రంధిరామునాయుడు పాల్గొన్నారు.

కిరాణా షాపులో చోరీ

దత్తిరాజేరు: మండలంలోని పోరలి కూడలి వద్ద ఉన్న కిరాణా షాపులో ఆదివారం తెల్లవారు జామున రూ.20 వేల కిరాణా సామగ్రి చోరీ జరిగినట్లు పెదమానాపురం ఎస్సై శిరీష తెలిపారు.షాపు యజమాని గేదెల గణపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని చెప్పారు.

జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు నీలిమ


నీలిమను అభినందిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపక సిబ్బంది

శృంగవరపుకోట: పట్టణానికి చెందిన బత్తుల నీలిమ జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైందని కోచ్ ఆల్తి తాతబాబు చెప్పారు. గత ఏడాది నవంబర్ 4,5,6 తేదీల్లో తూర్పు గోదావరి జిల్లా నిడదవోలులో నిర్వహించిన అండర్-19 స్కూల్‌గేమ్స్ కబడ్డీపోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. ఈనెల 24 నుంచి 27 వరకూ కర్నాటకలోని మాండ్యా ప్రాంతంలో జరిగే జాతీయ కబడ్డీ పోటీల్లో నీలిమ రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహిస్తుందన్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జేవీ కృష్ణమూర్తి, సిబ్బంది నీలిమను అభినందించి ఆమె పోటీలకు వెళ్లేందుకు గాను కొంత ఆర్థిక సహాయం అందించారు. జాతీయస్థాయిలో రాణించి కళాశాలకు మంచి పేరు తీసుకు రావాలని ఆకాంక్షించారు.

ఆర్మీ ఉద్యోగి అదృశ్యం


ఆర్మీ ఉద్యోగి గురునాయుడు

గంట్యాడ: సెలవులకు ఇంటికి వచ్చిన ఆర్మీ ఉద్యోగి ఒకరు అదృశ్యమయ్యారు. వివరాలిలా ఉన్నాయి. గంట్యాడ మండలంలోని నరవ గ్రామానికి చెందిన సుంకరి గురునాయుడు ఆర్మీలో పనిచేస్తున్నాడు. ఇటీవల సెలవులకు గ్రామానికి వచ్చాడు. ఈనెల 3వతేదీన బెంగళూరు ఆర్మీ క్యాంప్‌కు వెళ్తానని బయల్దేరి వెళ్లాడు. అయితే అక్కడికి చేరుకున్నాడా? లేదా అని కుటుంబసభ్యులు ఫోన్ చేస్తుండగా ఫోన్ స్విచాఫ్ వస్తోంది. దీంతో తండ్రి రమణ తన కుమారుడు అదృశ్యమయ్యాడని పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హెచ్‌సీ మజ్జి గణపతిరావు తెలిపారు.

విద్యతోనే సమాజ వికాసం

- సెంట్రల్ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ కట్టిమణి


సదస్సులో మాట్లాడుతున్న సెంట్రల్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ కట్టిమణి

గరుగుబిల్లి: సమాజం అభివృద్ధి పథంలో నడిచేందుకు విద్య చాలా అవసరమని సెంట్రల్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ టీవీ కట్టిమణి అన్నారు. ఈ మేరకు ఆదివారం గరుగుబిల్లి మండలంలోని తోటపల్లిలో జట్టు ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు-సామాజిక బాధ్యత అనే అంశంపై డా.పారినాయుడు అధ్యక్షతన జరిగిన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చదువుకోవడం ద్వారానే విజ్ఞానాన్ని పొందగలరని, దేశ ఆర్థిక వ్యవస్థను సుస్థిరం చేయడంలోనూ, ప్రజల కనీస అవసరాలను తీర్చడంలోనూ విద్య ప్రాధాన్యం చాలా ఉందన్నారు. నేటి సమాజం సామాజిక, మానసిక, ఆరోగ్య రుగ్మతలతో బలహీనమవుతోందని, వాటిన్నింటినీ అధిగమించి, ఆరోగ్యకరమైన సమాజం నిర్మాణానికి రసాయన ఎరువులు, పురుగు మందులు లేని, ప్రకృతి వ్యవసాయ విధానాలద్వారా పండించిన పంటలు వినియోగించడం ఒక్కటే మార్గమని సూచించారు. పంటల్లో విచక్షణా రహితంగా ఉపయోగిస్తున్న రసాయనాలు సకల జీవరాశుల మనుగడపై ప్రతికూల ప్రభావం చూపుతాయని, సమాజం వికసించాలంటే విద్యతోపాటు వ్యవసాయ విజ్ఞానం కూడా అవసరమేనని, ఉపాధ్యాయులు భావితరాలకు దిక్సూచి వంటి వారిని, వారి చేతిలో ఉన్న జ్ఞానమనే ఆయుధాన్ని సరైన పద్ధతిలో వినియోగించినప్పుడు విద్యార్థులు జ్ఞాన సంపన్నులై వికసిల్లుతారన్నారు. ఈ సందర్భంగా జట్టు ట్రస్టు, రైతు సాధికారసంస్థ రూపొందించిన ప్రాథమిక పాఠశాలలు-ప్రకృతి వ్యవసాయం పరిచయ పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆంధ్రా యూనివర్సిటీ మాజీ రెక్టార్ ప్రొ.ఎం.ప్రసాదరావు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బెలగాం జయప్రకాష్ నారాయణ, ఏపీటీఎఫ్ రాష్ట్ర ముఖ్య కార్యదర్శి కె.భానుమూర్తి, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎం.మహేష్, పీఎస్. ప్రకాశ్‌రావు, డాక్టర్ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఖేలో ఇండియా జాతీయ పోటీలకు ఎర్రయ్య


జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన ఎర్రయ్య

- 24 నుంచి చెన్నైలో వాలీబాల్ పోటీలు

విజయనగరం: జాతీయస్థాయిలో జరగబోయే ఖేలో ఇండియా వాలీబాల్ పోటీలకు విజయనగరం జిల్లాకు చెందిన బెవర ఎర్రయ్య ఎంపికయ్యాడు. ఈనెల 24 నుంచి 28వ తేదీ వరకు అండర్-19 విభాగంలో చెన్నైలో జరగనున్న పోటీలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టు తరుపున ఎర్రయ్య ప్రాతినిధ్యం వహించనున్నాడు. జాతీయ పోటీలకు ఎంపికైన ఎర్రయ్యను జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గవర సూరిబాబు, కేవీఏఎన్ రాజు, రాష్ట్ర కార్యదర్శి టీవీ భగవాన్‌దాస్, జిల్లా సంయుక్త కార్యదర్శి కె.కృష్ణంరాజు, కోశాధికారి కె.సన్యాసినాయుడులు అభినందించారు. జాతీయ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా కీర్తి ప్రతిష్ఠలు చాటి చెప్పాలని ఆకాంక్షించారు.

చికెన్		
బ్రాయిలర్		
లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹115	₹200	₹210

వాకింగ్ ట్రాక్ పనుల పరిశీలన


ట్రాక్ పనులు పరిశీలిస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

చీపురుపల్లి: పట్టణంలోని జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్మాణంలో ఉన్న వాకింగ్, జాగింగ్ ట్రాక్ పనులను ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ ఆదివారం పరిశీలించారు. యువత, విద్యార్థుల విజ్ఞప్తి మేరకు వాకింగ్, జాగింగ్ ట్రాక్ నిర్మాణం కోసం రూ.10 లక్షలు ఎంపీ ల్యాడ్స్ నిధులను ఆయన గతంలో మంజూరు చేశారు. ఆ నిధులతో కళాశాల మైదానంలో పనులు జరుగుతున్నాయి. దీంతో ట్రాక్ పనులను పరిశీలించిన ఆయన పనులు ఎంతవరకు వచ్చాయో అడిగి తెలుసుకుని త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. నిర్మాణంలో నాణ్యత పాటించాలని చెప్పారు. ఇక్కడ ఏర్పాటుకానున్న వాకింగ్, జాగింగ్ ట్రాక్ ఎంతో మందికి ఉపయోగపడుతుందని, యువత, విద్యార్థులు, పెద్దలు అందరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ, క్రీడాకారులు, యువత ఉన్నారు.

11 మంది ఎస్‌ఈబీ ఎస్సైలకు బదిలీ

విజయనగరం క్రైమ్: జిల్లాలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో విభాగంలో వివిధ పోలీస్‌స్టేషన్‌లలో ఎస్సైలుగా పనిచేస్తున్న 11 మందిని రాష్ట్ర స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో కమిషనర్ ఆదేశాల మేరకు విశాఖ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో డిప్యూటీ కమిషనర్ వివిధ స్టేషన్‌లకు బదిలీ చేశారు. దీనికి సంబంధించిన ఉత్తర్వులను జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఎస్.వెంకటరావు ఆదివారం జారీచేశారు. ఎస్‌ఈబీ విజయనగరం-1 ఎస్సై పి.జాన్‌ప్రసాద్ పాయకరావుపేటకు, విజయనగరం-2 ఎస్సై వీఎల్.కరుణలత ఆముదాలవలస, భోగాపురం ఎస్సై ఈ.రామకృష్ణ పొందూరు, చీపురుపల్లి ఎస్సై పి.సత్యనారాయణమూర్తి అరకు, నెల్లిమర్ల ఎస్సై పి.నాగలక్ష్మి రణస్థలం, గజపతినగరం ఎస్సై పి.అప్పారావు చోడవరం, ఎస్.కోట ఎస్సై ఎన్.రమ్యశ్రీ గాజువాక, కొత్తవలస ఎస్సై పి.నరేంద్ర కుమార్ ఇచ్ఛాపురం, బొబ్బిలి ఎస్సై పి.చిన్నంనాయుడు భీమిలి, రాజాం ఎస్సై ఎస్.పిచ్చేశ్వరరావు పురుషోత్తంపురం, డీటీఎఫ్ విజయనగరం ఎస్సై జి.గిరీష్‌కు విశాఖ ఎస్‌ఈబీ కంట్రోల్‌రూమ్‌కు బదిలీ అయ్యారు.

సిమ్మినాయుడి సిత్రం.!

- జబర్దస్త్‌తో ప్రారంభమై సినీఫీల్డ్ వరకు ప్రయాణం


శ్రీకాంత్ హీరోగా చేసిన కోటబొమ్మాళి ఐపీఎస్ చిత్రంలో..


వంజరాపు సిమ్మి నాయుడు


జయమ్మ పంచాయతీలో ఆటో డ్రైవర్‌గా నటి సుమ కనకాలతో

పాలకొండ రూరల్: ఎంచుకున్న రంగంలో శ్రమిస్తే ఫలితం దక్కుతుందని పాలకొండ నగర పంచాయతీ పరిధి ఎన్‌కే.రాజపురానికి చెందిన వర్ధమాన సినీనటుడు వంజరాపు సిమ్మినాయుడు రుజువు చేస్తున్నాడు. ఎటువంటి సినీ బ్యాక్‌గ్రౌండ్ లేకపోయినప్పటికీ సినీరంగంపై తనకున్న మక్కువతో అహర్నిశలూ కష్టించాడు. వ్యవసాయ కుటుంబానికి చెందిన తన తండ్రి సూర్యనారాయణ రోజువారీ వేతదారు కావడం, తల్లి అచ్చియ్యమ్మ చిన్నతనంలో మరణించడంతో తాత, అమ్మమ్మ అప్పలస్వామి, చిన్నమ్మ, అత్తా మామ పాపారావు, పోలమ్మల వద్ద తమ్ముడు పోలినాయుడుతో కలిసి పెరిగాడు. ఐటీఐ పూర్తి చేసి ఒడిశాలోని ఓ ఆయిల్ కంపెనీలో, అటుపై నిర్మాణ సంస్థల్లో పనిచేస్తూ బంగ్లాదేశ్ వెళ్లి అక్కడ పవర్ ప్రాజెక్టులో చేరాడు. నటనపై మక్కువను వదులుకోలేక 2018లో హైదరాబాద్ చేరుకుని అన్నపూర్ణ స్టుడియోలో గల స్నేహితుల ద్వారా జబర్దస్త్‌లో స్థానం కోసం యత్నించాడు. కమెడియన్ దొరబాబు ద్వారా జబర్దస్త్‌లో అవకాశం దక్కించుకున్నాడు. రాకెట్ రాఘవ టీమ్‌లో దాదాపు 20 స్కిట్‌లు చేశాడు. అటుపై సినీ రంగంలో తనకంటూ స్థానం దక్కించుకోవాలని తీవ్రంగా శ్రమించి యాక్టర్ రచ్చ రవి పరిచయం ద్వారా సినీ అవకాశాలు పొందేందుకు అవసరమైన మెలకువలు తెలుసుకున్నాడు.

తొలి అవకాశం..

యాంకర్ సుమ ప్రధాన భూమికలో నటించిన జయమ్మ పంచాయతీ సినిమా షూటింగ్ పాలకొండ పరిసరాల్లో జరిగింది. ఆ సమయంలో వెండితెరపై కనిపించేలా ఆటోడ్రైవర్‌గా తొలి అవకాశం దక్కింది. అటుపై సేనాపతి సినిమాలో బ్యాంక్ క్యాషియర్‌గా, మ్యూజిక్ స్కూల్‌లో కానిస్టేబుల్‌గా, ఐపీఎల్ మూవీలో క్రికెటర్‌గా నటించాడు. బీమ్లా నాయక్, ఆచార్య, చాంగురే బంగారురాజా వంటి సినిమాల్లో అవకాశం దక్కించుకున్నాడు. తమిళ స్టార్ హీరో ధనుష్ నటించిన 'సార్' చిత్రంలో పేపర్‌బాయ్‌గా నటించడంతో మంచి గుర్తింపు సాధించాడు. హీరో శ్రీకాంత్ నటించిన 'కోటబొమ్మాళి ఐపీఎస్' చిత్రంలో అవకాశం వచ్చింది. దాదాపు 30 చిత్రాల్లో వచ్చిన ప్రతి అవకాశం వినియోగించుకుంటూ ముందుకు వెళ్తున్నట్లు సిమ్మినాయుడు తెలియజేశాడు. ఇటీవల పండగ సందర్భంగా స్వగ్రామం వచ్చిన ఆయన సాక్షితో మాట్లాడాడు. కొద్ది రోజుల్లో రిలీజ్ కానున్న శబరి, పురుషోత్తముడు, సకుటుంబయానం, అసురగణ రుద్ర, రాచరికం, వరుణ్ తేజ్ హీరో నటిస్తున్న 'మట్కా' తదితర చిత్రాల్లో అవకాశం దక్కించుకున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో మంచి నటుడిగా రాణించి స్వగ్రామానికి పేరు తీసుకువస్తానని చెబుతున్నాడు.

అయోధ్యలో తప్పెటగుళ్ల ప్రదర్శన


తప్పెటగుళ్లు ప్రదర్శన ఇస్తున్న బృందం

మక్కువ: శ్రీరామ జన్మభూమి అయోధ్యలో బాల రాముడి ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమంలో మక్కువ మండలం వెంకటభైరిపురం గ్రామానికి చెందిన కళాకారులు తప్పెటగుళ్ల ప్రదర్శన ఇస్తున్నారు. ఈనెల 18 నుంచి 22వతేదీ వరకు ప్రదర్శన ఉంటుందని తప్పెటగుళ్ల బృందం గురువు అల్లు వెంకటరమణ తెలిపారు. అయోధ్యలో ఇలా ప్రదర్శనకు అవకాశం రావడంపై పార్వతీపురం మన్యం జిల్లా వాసులంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు.